కార్డియాక్ స్పెషల్ ప్యాకేజీ 2





భవిత విద్యార్థులకు అభినందన 2

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

19-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## సీఎంకప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కాకతీయ విద్యార్థిని




**అక్షరటుడే, ఇందూరు:** సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కాకతీయ విద్యా సంస్థలకు చెందిన శ్రీజ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నటరాజ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్లు సీహెచ్ రజనీకాంత్ తేజస్విని క్రీడాకారిణి శ్రీజను అభినందించారు.

# రైతులకు యాప్‌సోపాలు

■ కామారెడ్డి జిల్లాలో యూరియా ఉన్నట్టు యాప్‌లో ప్రత్యక్షం ■ షాపుల వారిగా తనిఖీ చేస్తే నో స్టాక్ ■ బస్తాల కోసం రైతుల తిప్పలు ■ క్షణాల్లో బుక్ అయిపోతున్న వైనం

**రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ ద్వారా బస్తాలు బుక్ చేసుకోవడానికి అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పంటలకు యూరియా వేయాల్సిన సమయం కావడంతో నిత్యం యాప్ ఓపెన్ చేసి ఎక్కడ స్టాక్ ఉందో అని వెతుకుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి మరీ యూరియా తెచ్చుకుంటున్నారు. అయితే లారీలు వచ్చిన క్షణాల్లోనే యూరియా బుక్ అయిపోతుండడం, రైతుల అవసరాలకు తగ్గట్లు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**




కామారెడ్డి జిల్లాలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లాలో ఎక్కువగా వరి సాగు చేశారు. నీరు లేని ప్రాంతాల్లో మొక్కజొన్న వేశారు. ఈ పంటలకు యూరియా కీలకం. వరికి రెండు నుంచి మూడు సార్లు యూరియా చల్లుతారు. ప్రస్తుతం పంటకు యూరియా వేసే సమయం. దీంతో అన్నదాతలు నిత్యం ఎరువుల బస్తాల కోసం ఫోన్‌లో చూస్తున్నారు. అయితే స్టాక్ లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయం దాటేలోపే యూరియా చల్లకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.

యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వం ఫర్టిలైజర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రైతులు లైన్‌లో నిలబడే అవసరం లేకుండా.. ఫోన్ నుంచి యూరియా బస్తాలు బుక్ చేసుకోవచ్చు. అనంతరం వెళ్లి డబ్బులు చెల్లించి తెచ్చుకోవచ్చు. యాప్ ద్వారా రెండు సార్లు మాత్రమే యూరియా బుక్ చేసుకోవచ్చు. ఎకరానికి తొలిదశలో రెండు సంచులు, రెండో దశలో ఒక బస్తా మాత్రమే ఇస్తారు. దీంతో యూరియా ఎక్కువగా వినియోగించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధానం బాగానే ఉన్నా.. సరిపడా స్టాక్ లేకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. యాప్ గురించి సరైన అవగాహన లేకపోవడం, లాగిన్ చేయడం రాకపోవడం కూడా రైతులకు ఇబ్బంది తెచ్చి పెడుతోంది.

### యాప్‌లో స్టాక్.. దుకాణాల్లో నిల్

ఓ రైతు యూరియా బుకింగ్ కోసం యాప్ ఓపెన్ చేశాడు. రాష్ట్రంలో 2,98,010 బ్యాగులు, కామారెడ్డి జిల్లాలో 11,661 బ్యాగులు ఉన్నాయని చూపించింది. మండలాల వారీగా దుకాణాల్లో తనిఖీ చేయగా.. ఎక్కడ కూడా బస్తాలు అందుబాటులో లేవు. షాపులలో సంచులు లేకున్నా.. ఓపెన్ చేయగానే జిల్లాలో బస్తాలు ఉన్నట్లు చూపుతుండడం గమనార్హం. మరోవైపు స్టాక్ ఎప్పుడు వస్తుందోనని రైతులు నిత్యం యాప్ ఓపెన్ చేసి చెక్ చేసుకుంటున్నారు. లారీ రాగానే.. డీలర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అప్పుడు స్టాక్ చూపిస్తుంది. అయితే వందల బస్తాలు కూడా నిమిషాల్లోనే బుక్ అయిపోతున్నాయి. దీంతో స్మార్ట్ ఫోన్ లేని, బుకింగ్ చేసుకోవడం రాని రైతులకు యూరియా దొరకడం లేదు.

### అధిక ధరలు

యూరియా దొరకకపోవడం వల్ల రైతులు ఓ వైపు ఇబ్బందులు పడుతుంటే.. స్టాక్ ఉన్న చోట వ్యాపారులు ఒక్కో బస్తాపై రూ. 30 అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఒక్కో బస్తాకు రూ.266.50 తీసుకోవాల్సి ఉన్నా రూ.300 తీసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై కొందరు రైతులు ఫిర్యాదు చేయడంతో పలు షాపులపై చర్యలకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. అధికారులు స్పందించి యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

### స్టాక్ బుక్ చేసుకోవడంతో..

జిల్లాలో యూరియా కొరత లేదు. వచ్చిన స్టాక్ ఎప్పటికప్పుడు రైతులు బుక్ చేసుకుంటున్నారు. దాంతో యాప్‌లో స్టాక్ జీరో ఉందని చూపిస్తోంది. రైతులు బుక్ చేసుకున్న తర్వాత యూరియా తీసుకెళ్లకపోతే మళ్లీ యాప్ లో స్టాక్ చూపిస్తుంది. కామారెడ్డి పరిధిలో 7,889 యూరియా బస్తాలు బుక్ చేసుకోగా 7,133 బస్తాలు తీసుకెళ్లారు. ఇంకా 756 బ్యాగులు రైతులు తీసుకుని వెళ్లాల్సి ఉంది. యాప్ ద్వారా కొందరు రైతులు అవసరం లేకున్నా యూరియా బుక్ చేసుకుని ఇళ్లలో పెట్టుకుంటున్నారు. యూరియా బస్తాపై ఎక్కువ డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఒక దుకాణానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి స్టాక్ అమ్మవద్దని చెప్పాం.

**– పవన్ కుమార్, ఏవో, కామారెడ్డి**



## బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తూము పద్మ బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా గురువారం తూము పద్మ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమె గురువారం కార్యాలయంలో ఛైర్‌పర్సన్‌గా ఫైల్‌పై సంతకాలు చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 17 స్థానాలు, ఎంఐఎం పార్టీ 12 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఈ రెండు పార్టీలు పొత్తులో భాగంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో తూము పద్మ అధికారికంగా గురువారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచిన ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణ అభివృద్ధికి పాటుపడుతున్నారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి



**అక్షరటుడే, బాల్కొండ:** పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు పథకం లబ్ధిదారు మేక నాగేష్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంలో కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం మేక నాగేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పార్టీని పట్టి పీడిస్తున్నవారు వెళ్లిపోవాలి

### ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 ఏళ్లుగా పార్టీని పట్టి పీడిస్తున్న కోవర్టులు వెళ్లిపోవాలన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడిందని ఎంపీ అర్వింద్ అన్నారు. దక్షిణ తెలంగాణలో బలోపేతం కావాల్సి ఉందన్నారు. త్వరలో బీజేపీ భూ స్థాపితం అవుతుందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందించారు. ఆమె వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి వల్ల ఎవరు భూస్థాపితం అయ్యారో ప్రజలకు తెలుసన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని అర్వింద్ చెప్పారు. కేసుల కోసమే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో తన కుటుంబ అవినీతిని ఎవరు అడగకుండా ఉండేందుకు కొనడం మొదలు పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ వ్యవస్థలను నాశనం చేశారని, రేవంత్‌రెడ్డి దానిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. తాము వ్యవస్థలను ప్రక్షాళన చేయాలనుకున్నామని తెలిపారు. అందుకే ఎవరితో కలవలేదన్నారు. పలువురు సీనియర్ నాయకులను ఉద్దేశించి ఎంపీ అర్వింద్ కోవర్టులు అని వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశం అయింది. మెట్‌పల్లి లో బీజేపీ నాయకుడు సుఖేందర్ రెడ్డిని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యలు చేశారు. సుఖేందర్ రెడ్డి పార్టీని విడిచి వెళ్లిపోయారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ.. పార్టీకి పట్టిన పీడ పోయిందన్నారు. ఆయనకు, ఆయన భార్యకు ఇద్దరికీ టికెట్ ఇవ్వనని చెప్పడంతో వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్ కోవర్టు అని ఆయన ఆరోపించారు. కరీంనగర్‌ను నిజామాబాద్‌తో పోల్చలేమని ఆయన అన్నారు.

## విద్యార్థినికి షూ తొడిగిన ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ మండలం కౌలాస్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం షూస్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చన ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి తోట అర్చన ఆధ్వర్యంలో హైస్కూల్‌లో విద్యార్థులకు బూట్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తానే స్వయంగా విద్యార్థినికి షూ తొడిగించి లేస్ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, చిన్నపిల్లల అవసరాలను గుర్తించి వారికి సాయం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యతో పాటు పిల్లల మౌలిక అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తెలిపారు. పిల్లల ముఖాల్లో చిరునవ్వులు చూసి స్థానికులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మున్ముందు కూడా కొనసాగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## పాల్వంచలో ఎమ్మెల్యే కేవీఆర్ దిష్టిబొమ్మ దహనం

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని విమర్శిస్తే సహించేది లేదని పాల్వంచ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. పాల్వంచ మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కామారెడ్డికి ఏం చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పాటైన పాల్వంచ మండలానికి ఇస్తానన్న రూ.9 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తానని ప్రజలకు మోసపూరిత హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని నిలదీశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని, ఆ విషయాన్ని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. తమ నాయకుని గౌరవం ఇవ్వని ఎమ్మెల్యేకు తాము గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు

**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తూ, సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో యంగ్ ఇన్నోవేటర్స్ ఇన్ యాక్షన్ పేరుతో గురువారం 'ఆవిష్కార్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. లాభదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే సాధనాలు, కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, అంతరిక్ష పరిశోధన నమూనాలు తదితర అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు అభినందనీయమన్నారు. కేవలం తరగతి గది, పుస్తకాలకే పరిమితం కాకుండా అనేక అంశాల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటడం ఎంతో గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని కొత్త ప్రయోగాలు చేసేలా యాజమాన్యం తోడ్పాటును అందించాలని కలెక్టర్ సూచించారు. అప్పుడే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ బయటకు వస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆంథోని, లత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## తాడ్వాయిలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలో మక్కల కొనుగోలు కేంద్రం తిరిగి ప్రారంభమైంది. ఈ మేరకు నిర్వాహకులు మాట్లాడుతూ రైతులు వద్ద దళారులు క్వింటాలుకు రూ.1,600 మాత్రమే చెల్లిస్తున్నారని, కానీ కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2400 ఉందన్నారు. గతంలో మిగిలిన మక్కలను కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 40వేల టన్నుల మక్కల కొనుగోలుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు.



## బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ కార్యకర్తలను విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న బాల్కసుమన్ గురువారం పరామర్శించడానికి వెళ్తున్న హరీష్ రావుకు ఆర్మూర్‌లో బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అగ్గు క్రాంతి, బీఆర్ఎస్ నాయకులు పూల సుధాకర్, అల్జాపూర్ మహేందర్ పాల్గొన్నారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
గురువారం
19.2.2026
www.aksharatoday.in
AKSHARA TODAY

## వెల్లుట్లపేటలో ఉపాధి హామీ పనుల పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్లపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ కొయ్యల వినోద, ఉప సర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్, వార్డు సభ్యుడు గాండ్ల సాయిరాం పరిశీలించారు. పని ప్రదేశాలను సందర్శించి, కూలీలతో మాట్లాడి పనుల నాణ్యత, హాజరు వివరాలు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొయ్యల వినోద మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పనులు ఎంతో కీలకమని, ప్రతి పని నాణ్యతతో పూర్తి కావాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్ల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మీసాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం బూట్లు, సాక్స్‌లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి 22 జతల బూట్లు, సాక్స్‌లను సర్పంచ్ బోండ్ల మైసయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గులాం షాకీర్ విద్యార్థుల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దూరి భాగయ్య, వార్డు సభ్యులు కాశీరాం, భూమయ్య ఉపాధ్యాయులు ఇష్రత్, స్వాతి, కారోబార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ప్రజలు వచ్చే వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దీపక్ కుమార్ గురువారం వెల్లడించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. వేసవిలో ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు డాబాలపై, వాకిళ్లలో పండుకుంటారని దీనిని ఆసరా చేసుకుని దుండగులు చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఇంట్లో విలువైన వస్తువులను పెట్టుకోవద్దని సూచించారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలుంటే చోరీలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని.. కావున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోరారు.



బోర్గాం(పి)లో శివాజీ విగ్రహానికి బీజేపీ నేతల నివాళులు..



నగరంలోని బోర్గాం(పి) వద్ద..



నగరంలోని వినాయక్‌నగర్‌లో గల హనుమాన్ విగ్రహం వద్ద..

# వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ..

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడిజిల్లాలో శివాజీ మహరాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. భారత జాతి సగర్వంగా చెప్పకునే ధీరుడు అని కొనియాడారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



గాంధారి మండల కేంద్రంలో..



వేంపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ..



కామారెడ్డిలో ఎమ్మెల్యే కేవీఆర్..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..



వేల్పూర్ మండల కేంద్రంలో ..



తిమ్మాపూర్‌లో శివాజీ జయంతి వేడుకలు





వెల్లుట్లలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



వెంకటాపూర్ గ్రామంలో..



ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు..



నగరంలో డీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాబోయే వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీడీవో తాహెరా బేగం సూచించారు. హాజీపూర్‌లో గురువారం తాగునీటి ట్యాంకు, బోరుబావులను పరిశీలించారు. ప్రజలు సైతం తాగు నీటి వృథా చేయకుండా కాపాడుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. మీరు సక్రమంగా పెట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతోపాటు ఎంపీవో ప్రకాష్, మిషన్ భగీరథ ఏఈ, అధికారులు ఉన్నారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు గురువారం గ్రామస్థులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దివిటి రమేష్ మాట్లాడుతూ.. చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి యువకులు ముందుకు రావడం చాలా సంతోషకరం అన్నారు. గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో రాబోయే తరాలకు శివాజీ మహరాజ్ చరిత్ర పిల్లలకు తెలుస్తుందని సర్పంచ్ అన్నారు. ఆయన చూపిన మార్గం, ఆయన ధైర్యాన్ని పిల్లలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నరేష్ గౌడ్, విఠల్ యువకులు పాల్గొన్నారు.

## గగ్గుపల్లిలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లిలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్ తెలిపారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకులను శుభ్రపర్చడం, పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి బాగుచేయించినట్లు తెలిపారు. ప్రతిఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. నీటిలో నాణ్యత పరీక్షలు నిర్వహించి, ప్రజలకు ఆరోగ్యకరమైన నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పారిశుధ్య అంశంలో భాగంగా ప్రైవేట్ సిబ్బందితో గ్రామంలో చెత్త తొలగింపు, డ్రెయినేజీలు శుభ్రపర్చే పనులు వేగవంతం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్, సెక్రెటరీ కిషోర్, వార్డు మెంబెర్లు శంకర్, ఆకాష్ శెట్టి, తెడ్డు సాయమ్మ, మదరి రాణి గ్రామ పంచాయతీ సిబ్బంది గంగాధర్, ప్రకాష్,నారాయణ, విజయ పాల్గొన్నారు.

# తిరుమల నర్సింగ్ హోంలో కార్డియాక్ స్పెషల్ చెకప్ ప్యాకేజీ



**అక్షరటుడే, ఇందూరు:** నేటి ఆధునిక యుగంలో గుండె సంబంధిత సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. కార్డియాక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఎంతో మేలు చేస్తుంది. గుండె వ్యాధి సంబంధిత లక్షణాలు ఉన్నవారు, 30 ఏళ్లు పైబడిన వారు, కుటుంబంలో వారసత్వంగా గుండె జబ్బులు ఉన్నవారు అప్పుడప్పుడు పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనివల్ల తీవ్రమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త పడవచ్చని చెబుతున్నారు. పరీక్షలు చేయించుకునేందుకు నిజామాబాద్ నగరంలోని 'తిరుమల నర్సింగ్ హోం'లో కార్డియాక్ స్పెషల్ చెకప్ ప్యాకేజీ అందుబాటులోకి తెచ్చినట్లు డాక్టర్ సందీప్ రావు తెలిపారు. కేవలం రూ. 2,499లకే పలు రకాల పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బ్లడ్ ఇన్వెస్టిగేషన్స్, సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), ఎఫ్‌బీఎస్ (ఫాస్ట్ బ్లడ్ షుగర్), గ్లైకో హెచ్‌బీ, ఫాస్టింగ్ లిపిడ్ ప్రొఫైల్, సీరమ్ క్రియేటిన్, టీఎస్‌హెచ్, కార్డియాక్ ఎవల్యూషన్, టూడీ ఎకో, ట్రెడ్‌మిల్ టెస్ట్ తదితర పరీక్షలు చేయనున్నామని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడిలో గల (తిరుమల నర్సింగ్ హోం కార్డియాక్ కేర్ హాస్పిటల్) డాక్టర్ జీవన్ రావు హాస్పిటల్‌లో సంప్రదించవచ్చు. అపాయింట్‌మెంట్ బుకింగ్ కోసం 93902 91462 నంబరును ఫోన్ చేయవచ్చు.

## భవిత విద్యార్థులకు అభినందన



**అక్షరటుడే, ఇందూరు:** హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల క్రీడా పోటీల్లో జిల్లాలోని భవిత కేంద్రాల చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి చిన్నారులను అభినందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు భవిత కేంద్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధా రణ విద్యార్థులకు సమానంగా.. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు ప్రోత్సాహం అందించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఐఆర్పీలు పాల్గొన్నారు.

## విద్యానగర్ అభివృద్ధికి కృషి చేస్తాం



**అక్షరటుడే, భీమ్‌గల్:** మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరే నాగమణి, వైస్ ఛైర్‌పర్సన్ సంటి లత తెలిపారు. విద్యానగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ పర్శ కుశలతలను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కాలనీలోని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొదిరే స్వామి, జేజే నర్సయ్య, పర్శ అనంత్ రావు పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి విద్యానగర్ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు నడుకుడ గంగ సాయన్న, మందం భూమేశ్వర్, కోటగిరి హరి, గంగాధర్, కిషన్, రమేష్, రాజేశ్వర్, బ్రహ్మయ్య అభినందనలు తెలిపారు.

## కల్యాణలక్ష్మి దరఖాస్తులకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్..



**అక్షరటుడే, భీమ్‌గల్ :** నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు ఊరట లభించింది. మంజూరుకు సిద్ధంగా ఉన్న మొత్తం 207 ఫైళ్లపై మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం వేల్పూర్‌లోని తన నివాసంలో సంతకాలు చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన తహశీల్దార్లు ఈ క్రతువులో పాల్గొన్నారు. కమ్మర్‌పల్లిలో 28 దరఖాస్తులు, బాల్కొండ 38, ముప్కాల్ 7, మోర్తాడ్ 29, వేల్పూర్ 55, మెండోరా 17, భీమ్‌గల్ 21, ఏర్గట్ల 12 మండలాలకు సంబంధించిన దరఖాస్తులను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదముద్ర వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచే ఈ పథకానికి సంబంధించిన ఫైళ్లను అధికారులు తమ వద్ద పెండింగ్‌లో ఉంచుకోకూడదని స్పష్టం చేశారు. త్వరితగతిన సంతకాలు పూర్తి చేసి, నిధుల విడుదల కోసం వెంటనే ప్రభుత్వానికి నివేదికలు పంపాలని తహశీల్దార్లను ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో చెక్కులు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.